నోటిఫికేషన్లు ఇవ్వాలి చిక్కడపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అశోక్ నగర్‌లో నిరుద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగులు సింధూరెడ్డి, ఆస్మా, శాంతి, రజిత, సునీత పాల్గొన్నారు.

మూసీ వరద బాధితులను ఆదుకోవాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ వరద బాధితులను ఆదుకోవాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు జావిద్, అశోక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అంబర్‌పేటలోని న్యూకృష్ణనగర్, లంకబస్తీల్లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో వరద ముంచుకొచ్చి బస్తీల ప్రజలు నీట మునిగారని అన్నారు. బాధితులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షులు రాజయ్య, నవీన్, సీఐటీయూ నగర నాయకులు రాములు, సుబ్బారావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


ముంపు బాధితులతో మాట్లాడుతున్న డీఐఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలి

గోల్నాక: ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలని సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాక ప్రాంతమైన కృష్ణానగర్‌లో సీపీఎం నేతలు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకునే వరకు సీపీఎం వారికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, మహేందర్, పార్టీ నగర కమిటీ సభ్యులు వరలక్ష్మి, షబానా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: రెండు రోజులుగా నగరంలో కురిసిన వర్షాలకు ఉస్మాన్‌సాగర్ నుంచి వచ్చిన వరదనీటికి మూసారాంబాగ్ బ్రిడ్జిపై చెత్త, చెదారం పేరుకుపోయింది. సర్వీస్ రోడ్డు పెచ్చులూడి పాక్షికంగా దెబ్బతిన్నది. ఆదివారం రోడ్డును అంబర్‌పేట సర్కిల్16 డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంవోహెచ్ డా.హేమలతలు సందర్శించారు. కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి గోల్నాక న్యూ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు.

ఆర్టీసీ లక్కీడ్రాను సద్వినియోగం చేసుకోవాలి: డీఎం

రాంనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రవేశపెట్టిన దసరా లక్కీ డ్రాను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్ సురేందర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి వచ్చే నెల 6 వరకు సెమి డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. వచ్చే నెల 8న డ్రా తీసి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఎంపికైన వారికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందజేయనున్నట్లు డీఎం తెలిపారు.


క్రికెట్ మ్యాచ్ రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు

భారత్- పాక్ మ్యాచ్‌ను ఎవరూ చూడొద్దు

● ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.సుధాకర్

రాంనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత్- పాక్ మ్యాచ్‌ను ఎవరూ చూడొద్దని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.సుధాకర్ అన్నారు. భారత్- పాక్ క్రికెట్ మ్యాచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌పై ప్రతీకారం తీసుకుంటామన్న ప్రధాని మోదీ ఎందుకు క్రికెట్ మ్యాచ్‌కు అనుమతిచ్చారని ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ ఆడడమంటే దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని ఆయన అన్నారు. బీసీసీఐ అధ్యక్షుడు జైషా కోసమే ఈ మ్యాచ్‌కు అనుమతించారని సుధాకర్ ఆరోపించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి



శ్రీనివాస్

చిక్కడపల్లి: కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీఎన్ శ్రీనివాస్‌యాదవ్ కొనియాడారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అమలైన కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశంలో ఎక్కడా అమలు కాలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

అంబర్‌పేట అభివృద్ధికి సీఎం కృషి

బర్కత్‌పుర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. 22 నెలల్లో సీఎం ఆరు సార్లు అంబర్‌పేటలో పర్యటించారన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ అంబర్‌పేటను విస్మరించారని ఆరోపించారు. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసి ప్రజలకు అంకితమివ్వడం అభినందనీయమన్నారు.

హోమియోపతి బెస్ట్ : డా. బస్వానందం


బస్వానందం

చిక్కడపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో హోమియోపతి బాగా పని చేస్తుందని హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.దండెపు బస్వానందం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, హోమియో వైద్యసేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి ప్రజలకు హోమియోపతి వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే తన ధ్యేయమని అన్నారు. హోమియోపతి వైద్యంతో రోగాలు ఆలస్యంగా నయం అవుతాయనే అపోహ నిజం కాదన్నారు. ప్రతి మండల కేంద్రంలో డిస్పెన్సరీలను ఏర్పాటు చేసి హోమియోపతి వైద్యం ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

బర్కత్‌పుర: హాస్టల్ విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించేలా కృషి చేస్తున్నట్లు వైశ్య హాస్టల్ చైర్మన్ జయప్రకాష్‌రామ్ పేర్కొన్నారు. కాచిగూడలోని వైశ్యహాస్టల్ ప్రాంగణంలో ఆధునీకరించిన హాస్టల్ గదులను ఆదివారం ఆయన ప్రారంభించారు. వైశ్య హాస్టల్ కార్యదర్శి మల్లికార్జున్, మధు పాల్గొన్నారు.

సమాజ సంస్కరణలకు సాహితీ ఆయుధం జాషువా

కవాడిగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై అక్షర యుద్ధం చేసిన మహాకవి గుర్రం జాషువా అని పలువురు వక్తలు కొనియాడారు. జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్, తెలంగాణ సాహితీ రాష్ట్ర కన్వీనర్ ఆనందాచారి, టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృపాసాగర్, విజయ్‌కుమార్, మోహన్‌కృష్ణ, సలీమ, శరత్, సుబ్బారావు, రాములు పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలతో అతిథులు

జాషువా పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో జాషువా జయంతిని పురస్కరించుకు ని జాషువా సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈసందర్భంగా సూళ్ళూరుపేటకు చెందిన కళాకారులను నృత్యలక్ష్మి అవార్డుతో, తాళ్ళూరి మయూరి, భాస్కర్, పద్మావతి, రాజేష్, కుమారస్వామి, శంకర్, షేక్‌మస్తాన్, వెంకటేశ్వర్లను గుర్రం జాషువా సాహిత్య పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. విశ్రాంత న్యాయమూర్తి డా. బూర్గుల మధుసూదన్‌రావు, నారాయణరెడ్డి, సౌందర్య పాల్గొన్నారు.

● బతుకమ్మ వేడుకల్లో కిషన్‌రెడ్డి



గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆంధ్రాకేఫ్ వద్ద జరిగిన బతుకమ్మ వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, సినీ నటీ అశ్వినీశ్రీ, ప్రముఖ యాంకర్ త్రిపుర నిమ్మగడ్డ, ప్రఖ్యాత గాయని మహేశ్వరి, బీజేపీ నేతలు భరత్‌గౌడ్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

మోదీతోనే దేశాభివృద్ధి

ముషీరాబాద్: దేశ సమగ్రాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. సేవా పక్వాడ్ కార్యాక్రమంలో భాగంగా బీజేపీ ముషీరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

● చీరల పంపిణీ



దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అంబర్‌పేట డివిజన్ మహిళలకు ఆదివారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బతుకమ్మ చీరలను నాయకురాలు స్రవంతితో కలిసి పంపిణీ చేశారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి



హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ప్రవీణ్ కుమార్‌ను ఆదివారం లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

బీసీ రిజర్వేషన్లకు సహకరించాలి

రాంనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు అగ్ర కులాల వారు సహకరించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యాయాదవ్ అన్నారు. రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి అధ్యక్షుడు మాధవరెడ్డి హైకోర్టులో కేసు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కులను కాలరాయాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీల 42శాతం రిజర్వేషన్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి బీసీ బిడ్డ అగ్రకులాలపై తిరుగుబాటు చేయాలన్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించండి

కవాడిగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా హక్కులు కల్పించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, మేధావులు విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆదివారం ప్రజాసదస్సు నిర్వహించారు. సదస్సులో వక్తలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోకపోతే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అసైన్డ్ భూముల యజమానుల తరపున పోటీ చేస్తామని వారు హెచ్చరించారు. సదస్సులో జస్టిస్ చంద్రకుమార్, అసైన్డ్ భూముల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ఎస్సీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు. ప్రొఫెసర్లు తిరుపతి, అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సదస్సులో పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్, శివయ్య తదితరులు